## క్లుప్తంగా

### రోజువారీ 5 వేల పని దినాలు లక్ష్యం

బొల్లాపల్లి: ఉపాధి హామీ పథకంలో రోజువారీ 5వేలు పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించినట్లు ఆ పథకం ఏపీవో జీఎస్ ఆంజనేయరాజు సోమవారం తెలిపారు. ప్రస్తుతం మండలంలోని పలు పంచాయతీల్లో 1600 పనిదినాలు పూర్తవుతున్నాయన్నారు. మండలంలోని 33 పంచాయతీల్లో పూర్తిస్థాయిలో పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. గతంలోని 23 పంచాయతీలతో పాటు మరో 10 పంచాయతీలు నూతనంగా ఏర్పడ్డాయని, మొత్తం 33 పంచాయతీల్లో కొన్ని పంచాయతీలకు క్షేత్రసహాయకుల నియామకం జరగాల్సి ఉందన్నారు. క్షేత్రసహాయకుల నియామకం లేక పనులు మందకొడిగా సాగుతున్నాయన్నారు. వేసవి రావడంతో అన్ని పంచాయతీల్లో కూలీలకు పనులు కల్పించాల్సి ఉందని, ఫీల్డ్ అసిస్టెంట్లు లేని పంచాయతీలకు త్వరలో నియామకం చేపట్టి పనులు ప్రారంభిస్తామని ఏపీవో తెలిపారు.

### టెన్త్ పరీక్షలకు అధికారులు వీరే...

శావల్యాపురం: వచ్చే నెల 3 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు సిబ్బంది నియామకాన్ని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు చేపట్టారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా వినుకొండ రూరల్ నాగులవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శారదాదేవి, డిపార్టుమెంటల్ అధికారిగా అందుగుల కొత్తపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.జయశ్రీలను నియమించామన్నారు. ఇక మండలంలో ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉండగా 268 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధం అవుతున్నారని, ఇందులో బాలురు-129, బాలికలు-139 మంది ఉన్నట్లు చెప్పారు. మతుకుమల్లి-28, కారుమంచి-49, వేల్పూరు-56, పోట్లూరు-47, శావల్యాపురం-87 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

### బయోమెట్రిక్ తప్పనిసరి

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామసచివాలయాన్ని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి గ్రామసచివాలయ పరిధిలోని వలంటీర్లు ప్రభుత్వ నిబంధనలు మేరకు వారంలో మూడు రోజుల సోమవారం, బుధవారం, శుక్రవారం తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయ ఉద్యోగులు పనితీరు, హాజరు పట్టిక పరిశీలించి తగు సూచనలు చేశారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను అధిగమించడానికి అన్ని శాఖల అధికారులు తమవంతు సహకారం అందించాలన్నారు. అలాగే ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకంలో ఈకేవైసీ నమోదు పురోగతి పెంచాలన్నారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి ముండ్రు మనోహర్, డిజిటల్ సహాయకులు బాలకృష్ణ ఉన్నారు.

### విద్యార్థులు ఇష్టంగా చదవాలి



చిలకలూరిపేట: విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకురాలు పాలపర్తి పోలేరు చెప్పారు. పసుమర్రులోని మద్దికామయ్య జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రేరణ తరగతులను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బట్టీ విధానం విడనాడాలని చెప్పారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాలను ఏకాగ్రతతో వినాలని, సంబంధిత విషయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమయం విలువను తెలుసుకొని మసలుకోవాలని వెల్లడించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం షేక్ మొహమ్మద్ యాసిన్ పాల్గొన్నారు.

### కుంగ్‌ఫూ పోటీల్లో ప్రతిభ

చిలకలూరిపేట: పట్టణంలోని మోడరన్ కాంప్లెక్స్‌లో ఉన్న వాసవీ గ్రాండ్‌లో జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ 35వ ఇంటర్ స్టేట్ మార్షల్ ఆర్ట్స్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలలో న్యూ షావోలిన్ కుంగ్‌ఫూ అకాడమీ విద్యార్థులు పాల్గొని 15 బంగారు పతకాలు, 10 వెండి పతకాలు, 5 రజిత పతకాలు సాధించటంతో పాటు గ్రాండ్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ పతకాలు సాధించిన విద్యార్థులకు సోమవారం పట్టణంలోని సీఆర్ క్లబ్ ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుంగ్‌ఫూ ట్రైనర్లు బత్తుల విక్రమ్, షేక్ దరియావలి, కురిచేటి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

### చదలవాడ బుర్రకు చెదలు పట్టింది!

రొంపిచర్ల: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చదలవాడ అరవిందబాబు బుర్రకు చెదలు పట్టిందని, పదేపదే చవకబారు విమర్శలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఎంపీపీ భర్త, అలవాల గ్రామ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గడ్డం వెంకట్రావు విమర్శించారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మృతి చెందిన మండల టీడీపీ అధ్యక్షుడు వెన్నా బాలకోటిరెడ్డికి తమకు ఎలాంటి బేధాభిప్రాయాలు లేవన్నారు. బాలకోటిరెడ్డిపై మొదటిసారి హత్యాయత్నం జరిగినప్పుడు అరవిందబాబు ఇదే విధంగా తమ నాయకుడు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై విమర్శలు చేశాడన్నారు.

# బాబుకు అధికారమిస్తే సంక్షేమం ఉండదు

**ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి**



విద్యుత్ ప్రభ పై నుంచి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రస్తుతం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు ఆగిపోతాయని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో కొలువైన శ్రీ వీరాంజనేయస్వామి 42వ వార్షికోత్సవ తిరునాళ్ల మహోత్సవంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై నుంచి ప్రసంగించారు. శ్రీ వీరాంజనేయస్వామి ఆశీస్సులతో పల్నాడు ప్రాంతం పాడి పంటలతో తులతూగాలని ఆకాక్షించారు. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తరువాత వి.రెడ్డిపాలెంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. గ్రామంలో ప్రాథమిక వైద్యశాల, సీసీ రోడ్లు, మోడల్ స్కూల్, హైస్కూల్‌కి నాడు-నేడు ద్వారా కాంపౌండ్ వాల్స్, సచివాలయం నిర్మాణం చేపట్టామన్నారు. పేదలందరికీ ఇళ్ల పట్టాలతోపాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. చంద్రబాబుకు దమ్ము, ధైర్యం ఉంటే సింగిల్‌గా పోటీ చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సింగిల్‌గా పోటీ చేసే సత్తా ఉన్న పార్టీ వైఎస్సార్ సీపీ ఒక్కటే అన్నారు. ముందుగా వీరాంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో డాక్టర్ గోపిరెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, కురుగుంట శ్రీనివాస రెడ్డి, కోడూరి వెంకటేశ్వర రెడ్డి, గజ్జల మునసలా రెడ్డి, రాజనాల నాగిరెడ్డితో పాటు పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి



మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న శాలివాహన సంఘం నాయకులు

వినుకొండ(నూజెండ్ల): జిల్లా శాలివాహన సంఘం ఆధ్వర్యంలో తొలితెలుగు మహిళా కవయిత్రి కుమ్మరి మొల్లమాంబ జయంతిని పట్టణంలోని శాలివాహన సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. తొలుత మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు పారెళ్ల రమేష్ మాట్లాడుతూ తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ 583వ జయంతి వేడుకలు ప్రతి నియోజకవర్గంలో నిర్వహించడం ఎంతో మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో గొట్టం గోవిందరాజులు, మద్దికుంట ఆదినారాయణ, పారెళ్ల లక్ష్మయ్య, "బొంకూరి రోశయ్య, పారెళ్ల మల్లికార్జునరావు, పారెళ్ల కమలాకర్, చేతరాజుపల్లి నాగేశ్వరరావు, చీరాల ఆంజనేయులు, పారెళ్ల విజయ్, బ్రహ్మేంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ చెక్కు అందజేత

నరసరావుపేట: రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం గ్రామానికి చెందిన పొనుగోటి పద్మావతికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. పొనుగోటి వెంకటరావు పాల్గొన్నారు.

# మాత్రలతో పురుగులను 'నులి'మేద్దాం

- చిన్నారుల్లో రక్తహీనతకు కారణం అవే!
- నాదెండ్ల ఎంపీపీ తలతోటి రాణి
- నేడు పలు ప్రాంతాల్లో డీవార్మింగ్ మాత్రల పంపిణీ



నరసరావుపేటలో మాత్రలను ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

నాదెండ్ల: చిన్నారుల్లో నులిపురుగుల కారణంగా రక్తహీనత, పోషకాల లోపం వంటి తీవ్ర అనారోగ్యం తలెత్తుతుందని, నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేయాలని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. నేషనల్ డీవార్మింగ్ డే సందర్భంగా మండలంలోని అన్ని సచివాలయాల్లో సోమవారం అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. తూబాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, నాదెండ్ల వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సాయిశ్వేత తదితరులు పాల్గొన్నారు. ఎంపీపీ రాణి సీహెచ్‌వో రత్నరాజ్యం, ఎంపీహెచ్ఈవో విజయరాజు,భూపతిరావు,

**నరసరావుపేట రూరల్ పరిధిలో...**

నరసరావుపేట రూరల్: నులిపురుగుల ప్రభావం పిల్లలపై అధికంగా ఉంటుందని, దీనిని నివారించేందుకు అల్బెండజోల్ మాత్రలను వాడాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పాఠశాలల విద్యార్థులకు వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి అల్బెండజోల్ మాత్రలను అందించనున్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈ మాత్రలను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.

బొల్లాపల్లి: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని ఎంపీడీవో టి.పార్వతి అన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులు, చిన్నారులకు డీవార్మింగ్ డేను పురస్కరించుకొని ఆల్బెండోజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు.

**శావల్యాపురంలో...**

శావల్యాపురం: నేడు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని అన్నీ శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయిలో అవగాహన సదస్సు నిర్వహించారు.

**రొంపిచర్లలో...**

రొంపిచర్ల: మండలంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ రేవతిబాయి, స్వాతిలు తెలిపారు.

## ధర్మసంఘానికి ఆలయ తాళాలు



ధర్మసంఘం అధ్యక్షుడు పసుమర్తి సూర్యంకు ఆలయ తాళాలు అప్పగిస్తున్న అర్చకుడు శరత్

చిలకలూరిపేట: ఆర్యవైశ్యులకు చెందిన దేవాలయాలు,సత్రాలు, ఆర్యవైశ్య సంఘాలే నిర్వహించుకొనేలా రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించటం ఎంతో శుభ పరిణామమని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ధర్మసంఘం అధ్యక్షుడు పసుమర్తి సూర్యం చెప్పారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం గోశాల, గ్రంధాలయం, చలివేంద్రంలను స్వాధీనం చేస్తూ ఆలయ ప్రాంగణంలో ఈవో సాయిబాబా సమక్షంలో ఆలయ అర్చకులు శరత్ తాళాలను ధర్మసంఘానికి స్వాధీనం చేశారు. ముఖ్యమంత్రితో పాటు దేవదాయశాఖ మంత్రి కె.సత్యనారాయణకు, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినికు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కల్యాణమండపం కార్యదర్శి పొట్టి శ్రీరాములు, ఆర్యవైశ్య సంఘ నాయకులు గుర్రం సాంబశివరావు, మాజేటి నరేంద్ర, కోటా కృష్ణుడు పాల్గొన్నారు.

## బోయపాలెంలో ఉచిత దంతవైద్య శిబిరం

యడ్లపాడు: మండలంలోని పారిశ్రామికవాడ బోయపాలెం గ్రామంలో సోమవారం ఉచిత దంత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రపంచ ఓరల్ హెల్త్ డేను పురస్కరించుకుని సిబార్ దంతవైద్య కళాశాల, వసుంధర సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పారిశ్రామిక వేత్త గుంటుపల్లి కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల అభ్యున్నతికి మూలం కార్మికులేనని..వారి ఆరోగ్య సంరక్షణలో యాజమాన్యం బాధ్యతగా భావించినపుడే అది సాధ్యమని చెప్పారు. గ్రామస్తులకు, కార్మికులకు ప్రయోజనం చేకూరేలా తమ మిల్లు చేపట్టే పలు సేవా కార్యక్రమాల్లో ఉచిత వైద్య శిబిరం ఒకటన్నారు. దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా శిబిరానికి వచ్చిన వారికి వైద్యులు దంతాల పరిశుభ్రం, పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం 200 మందికి వివిధ రకాల దంత పరీక్షలను చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వసుంధర నూలుమిల్లు ఎండీ జి.కోటేశ్వర రావు, డైరెక్టర్లు సుభాష్‌బాబు, రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్మశాన వాటికలను పరిశుభ్రంగా ఉంచాలి



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ గోవిందరావు

చిలకలూరిపేట: పవిత్రమైన శ్మశాన వాటికలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ఉందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలోని హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశానవాటికలను మున్సిపల్ అధికారులతో కలసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఆదేశాల మేరకు శ్మశానవాటికల్లో జంగిల్ క్లీనింగ్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా ఉగాది నాటికి అన్ని శ్మశానవాటికల్లో పిచ్చికంప, ఇతర వ్యర్థాలను తొలగించి సుందరీకరించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. నేటి నుంచి ప్రారంభిస్తున్న ఈ కార్యక్రమం ఉగాది వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, మున్సిపల్ ఏఈఈ జ్యోతి, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాసరావు, ఇస్మాయిల్, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి పాల్గొన్నారు.

## భగత్ సింగ్ వర్ధంతిని జయప్రదం చేయండి

వినుకొండ(నూజెండ్ల): ఈ నెల 23వ తేదీన భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని వినుకొండ నియోజకవర్గంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్), అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్)ల ఆధ్వ ర్యంలో కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని తెలిపారు. స్థానిక శివయ్యభవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్య్ర ఉద్యమంలో దేశ యువతను ఉత్తేజపరిచి ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదంతో పోరాటం చేసిన వీరుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. 22వ తేదీన వినుకొండ పట్టణంలో భారీ కాగడాల ప్రదర్శన, 23న మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు బూదాల సాగర్‌బాబు, ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి పులిపాటి శశికుమార్, సహాయ కార్యదర్శి కార్తీక్, ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా నాయకులు గుండాల హర్ష, కె.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## నాదెండ్ల మండల బీసీ కమిటీ ఎంపిక



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందిస్తున్న అధికార ప్రతినిధి బాగున్నల

నాదెండ్ల: గణపవరంలోని మండలనేని కల్యాణ మండపంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం మండల నూతన కమిటీతో పాటూ గ్రామ కమిటీని ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా కందుల సుబ్బారావు, నియోజకర్గ గౌరవ అధ్యక్షుడుగా గుంటూరు ఆంజనేయులు, గణపవరం అధ్యక్షుడిగా అవ్వారు సుమన్‌ను ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధికార ప్రతినిధి బాగున్న శ్రీనివాసరావు చేతులమీదుగా నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో సంఘాన్ని బలోపేతం చేయాలని నూతన కమిటీని కోరారు. కార్యక్రమంలో నాయకులు దామర్ల మనోహర్, దాసరి శ్రీనివాసరావు, యడ్లపాడు అధ్యక్షుడు గున్నవరపు వెంకటరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ పోలయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటరావు, ఆంజనేయులు, శివశంకర్ పాల్గొన్నారు.

## ఆదర్శ మహిళ సేవా అవార్డు గ్రహీతకు సన్మానం



లీలావతిని సన్మానిస్తున్న మహిళలు

వినుకొండ(నూజెండ్ల): ఇటీవల సావిత్రిబాయి పూలే ఆదర్శ మహిళ సేవా అవార్డును అందుకున్న సీఎస్ఐ ఫౌండేషన్ కార్యదర్శి అమృతపూడి లీలావతిని స్థానిక ఇందిరానగర్‌లోని చర్చిలో సోమవారం ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరెన్నో అవార్డులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పెద్దీటి పొలేష్, దళిత ఐక్యవేదిక కార్యదర్శి రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని ఆటో డ్రైవరు మృతి



ఆటోను ఢీకొన్న కారు, మృతదేహం

రొంపిచర్ల: రోడ్డు పక్క ఆటోకు మరమ్మతులు చేస్తున్న వ్యక్తిని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన మండలంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై విప్పర్ల గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... నరసరావుపేటకు చెందిన దావల చిన్నోడు (27) ఆటోలో ఇరువురిని ఎక్కించుకొని హైవేపై ప్రయాణం చేస్తున్నారు. విప్పర్ల గ్రామం దాటిన తరువాత ఆటో టైర్ పంచరు కావడంతో ఆటోను రోడ్డు పక్కన నిలుపుదల చేసి మరమ్మతులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో హైవే రోడ్డుపై వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ చిన్నోడు అక్కడికక్కడే మృతి చెందగా, ఆటోలో ఉన్న మరో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ సి.హెచ్.సురేష్ బాబు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్ర గాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలలో చేర్పించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు.

## ఘనవ్యర్థాల నిర్వహణపై అవగాహన




కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్. శ్రీనివాసరావు

వినుకొండ(నూజెండ్ల) : స్థానిక గుర్రం జాషువా కళా ప్రాంగణంలో ఐటీసీ - ఎంఎస్‌కే బంగారు భవిష్యత్, సెర్ప్ సంస్థల ఆధ్వర్యంలో డివిజన్ లెవల్ ప్రజాప్రతినిధులకు వికేంద్రీకృత గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వినుకొండ, నూజెండ్ల, బొల్లాపల్లి, ఈపూరు, శావల్యాపురం, రొంపిచర్ల, నరసరావుపేట మండలాల గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు, క్లాప్ మిత్రలకు జగనన్న స్వచ్ఛ సంకల్పంపై గ్రామీణ ఘనవ్యర్థాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సెర్ప్ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ తడి, పొడి చెత్తను ఏ విధంగా వేరు చేయాలి, వర్మికంపోస్టు తయారీ, విభజన ప్రక్రియ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఐటీసీ-ఎంఎస్‌కే జిల్లా కో రీసోర్సు పర్సన్ సీహెచ్. బాలయ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ప్రదీప్, ఏసోబు, సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్‌పై దాడి

నరసరావుపేట టౌన్: ఆటో డ్రైవర్‌పై దాడికి పాల్పడిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గానుగుల బజార్‌కు చెందిన ఎ.రాంబాబు పనస తోటలో పాలుపోసి ఆటోలో వస్తున్నాడు. రోడ్డుపై నలుగురు యువకులు అడ్డంగా నిలబడి దారి ఇవ్వలేదు. పక్కకు జరగమన్నందుకు రాంబాబుపై సదరు యువకులు నలుగురు విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని స్థానికులు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు బాధితుడు సోమవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రహంతుల్లా తెలిపారు.

## రజక జన సేవాసంఘం అధ్యక్షుడిగా వీరబ్రహ్మం

చిలకలూరిపేటటౌన్: పట్టణ రజక జన సేవాసంఘం అధ్యక్షులుగా కుర్చేటి వీరబ్రహ్మం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక రజకసేవాసంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో సభ్యులందరి ఆమోదం మేరకు వీరబ్రహ్మంను అధ్యక్షునిగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. నూతన కమిటీ సభ్యులుగా ఉపాధ్యక్షుడు పొదిలి కాశియ్య, గుడికందుల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గుడికందుల ఆంజనేయులు,సహాయ కార్యదర్శిగా పేర్ల సాంబయ్య, కోశాధికారిగా ఊటికొండ గురవయ్య ఎన్నికైనట్లు వెల్లడించారు.

## విద్యుత్ చౌర్యంపై అధికారుల దాడులు

నరసరావుపేట: పట్టణంలో విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగానికి చెందిన అధికారులు సోమవారం పట్టణంలో 2604 కనెక్షన్లను తనిఖీ చేసి 134 మందికి రూ.6.46 లక్షల అపరాధ రుసుం విధించారు. డీపీఈ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.విజయకృష్ణ, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. దాడుల్లో 41 మంది అధికారులు, 123 మంది సిబ్బంది 41 బృందాలుగా ఏర్పడి విస్తృతంగా తనిఖీలు చేశారన్నారు. మీటరు లేకుండా నేరుగా చౌర్యానికి పాల్పడుతున్న తొమ్మిది మందిని గుర్తించి వారికి రూ.25 వేలు, మీటరు ఉన్నా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఒకరికి రూ.5 వేలు, అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరీలలో వినియోగించుకుంటున్న వారికి రూ.56 వేలు, అనుమతించిన లోడు కంటే అధికంగా ఉపయోగించుకుంటున్న 113 మందికి రూ.5.6 లక్షలు అపరాధ రుసుం విధించారన్నారు. విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేలా వినియోగదారులు చూసుకోవాలని, లేనిపక్షంలో కేసులు నమోదుచేయటం జరుగుతుందన్నారు. అపరాధ రుసుం చెల్లించకపోతే చట్ట ప్రకారం వారి ఆస్తి జప్తు చేయటం జరుగుతుందన్నారు. విద్యుత్ చౌర్యమనేది సామాజిక నేరమన్నారు. దీనిపై ఫిర్యాదులను 94408 12263, 94408 12360, 94408 12361 నెంబర్లకు ఫోన్ ద్వారా గాని వాట్సప్ ద్వారా సమాచారం ఇవ్వొచ్చన్నారు.

## పేద విద్యార్థికి ఆర్థిక సహాయం

నరసరావుపేట: మండలం చిన్న తురకపాలెం గ్రామానికి చెందిన పేద మెడికల్ విద్యార్థి షేక్ అఫ్రిదికి షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి రూ.15వేలు ఆర్థిక సహాయం సోమవారం అందజేశారు. శ్రీకాకుళం నిమ్స్ కాలేజీలో అఫ్రిది ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. గత నాలుగేళ్లుగా ఆ విద్యార్థికి సహాయం చేస్తూ ఎంబీబీఎస్ పూర్తిచేసేందుకు తన సహకారం అందజేస్తున్నారు. విద్యార్థి షేక్ అఫ్రిది మాట్లాడుతూ ఆర్థిక సాయం చేసిన ఖాజావలికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో షేక్ సుభాని, సయ్యద్ ఖాజా, షేక్ ఆదం పాల్గొన్నారు.